
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
5★★
జిల్లా వార్తలు
శుక్రవారం 8 నవంబరు 2024



న్యూస్ బాక్స్

రైతులు కెపాసిటర్లు బిగించుకోవాలి


పొలంబాట నిర్వహిస్తున్న అధికారులు

జగిత్యాలరూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఓల్టేజీ సమస్యలు రాకుండా రైతులు కెపాసిటర్లు బిగించుకోవాలని ఏడీఈ జవహర్‌లాల్‌నాయక్ రైతులకు సూచించారు. మండలంలోని మోరపల్లి గ్రామంలో గురువారం విద్యుత్ అధికారులు పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పొలాల వద్దకు వెళ్లి విద్యుత్ ప్రమాదాల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జవహర్‌లాల్‌నాయక్ మాట్లాడుతూ రైతులు ట్రాన్స్‌ఫార్మర్‌ల ఫ్యూజులు ముట్టవద్దని, ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉన్నం దున ఎలాంటి సమస్యలు వచ్చిన విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకువస్తే సమస్యను పరిష్కారిస్తారని తెలిపారు. పొలాల వద్ద రైతులు స్టార్టర్లు, ఫ్యూజ్‌లు నాణ్యతగా ఉండేవిధం గా చూసుకోవాలని రైతులను కోరారు. కార్యక్రమంలో ప్యాక్స్‌చైర్మన్ పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి, ఏఇ శ్రీధర్, విద్యుత్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


వెల్గటూరు మండలం పైడిపల్లి పాఠశాలలో ఉదయం బోధన చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు

ఈ ఫొటో జిల్లాలోని గొల్లపల్లి మండలం పైడిపల్లి గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందినది. పాఠశాలలో 40 విద్యార్థులున్నారు. వీరికి నలుగురు ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయుడు తులసి ఆగమయ్య ఉదయం వేళల్లో పాఠశాలలో బోధన విధులు నిర్వర్తించాడు. మధ్యాహ్నం విద్యార్థులకు భోజనం అందించిన అనంతరం గ్రామంలోని ఓ వార్డులో సమగ్ర కుటుంబ సర్వే బాధ్యతలను నిర్వహిస్తూ ఇళ్లను గుర్తించి స్టిక్కర్లు వేసే పనులు నిర్వర్తించాడు. ఇదే మాదిరిగా పాఠశాలకు చెందిన మిగిలిన ముగ్గురు ఉపాధ్యాయులు సైతం సర్వే విధుల్లో పాల్గొన్నారు. దీంతో మధ్యాహ్న భోజనం అనంతరం పాఠశాలకు తాళం వేయాల్సి వచ్చింది. ఇలా ఒక్క పాఠశాలనే కాదు..దాదాపుగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల పరిస్థితి ఇలాగే ఉంది.


పైడిపల్లిలో మధ్యాహ్నం కుల గణన సర్వే నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

ఉదయం బడి.. మధ్యాహ్నం సర్వే

- సమగ్ర కుటుంబ సర్వేలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు
- మధ్యాహ్నం వరకే కొనసాగుతున్న పాఠశాలలు
- విద్యార్థుల చదువులపై ప్రభావం పడుతుందంటున్న తల్లిదండ్రులు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో యథావిధిగా కొనసాగించాలని డిమాండ్
- జిల్లా వ్యాప్తంగా 131 పీఎస్ టీచర్లు... 995 ఎస్‌జీటీలకు సర్వే విధులు

జగిత్యాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా వేసవి కాలం ప్రారంభంలో నెలరోజుల పాటు ఒంటి పూట బడులను నిర్వహిస్తారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభు త్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేతో ప్రభుత్వ ప్రాథ మిక పాఠశాలలు ఒంటిపూట కొనసాగుతున్నాయి. దీంతో ప్రాథమిక విద్య కుంటుపడుతుందని విద్యా వేత్తలు, విద్యార్థి సంఘాల నాయకులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 1,126 మంది టీచర్లకు సర్వే విధులు..

జిల్లాలో దాదాపు వివిధ ప్రాంతాల్లో పలు పాఠశాలల్లో పనిచేస్తున్న 1,126 మంది ఉపాధ్యాయులు సమగ్ర కుటుంబ సర్వే విధులను నిర్వర్తిస్తున్నారు. ఇందులో 131 పీఎస్ టీచర్లు, 995 సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్‌జీటీ)లకు సర్వే విధులు కేటాయించారు. వీరు పాఠశాలల నుంచి మధ్యాహ్నమే నేరుగా సర్వేకు వెళ్లాల్సి వస్తోంది. ఉన్నత పాఠశాలల్లో నెలరోజుల క్రితం విధుల్లో చేరిన జూనియర్లను సర్వే విధులకు కేటాయించకుండా, వయసు పైబడిన వారికి విధులు కేటాయించడంపై ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మిగతా 8వ పేజీలో...

రైతులను ఇబ్బంది పెట్టకుండా కొనుగోళ్లు చేపట్టాలి

- కలెక్టర్ సత్యప్రసాద్

8


తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి

8


తిప్పన్నపేటలో సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

సామాజిక తనిఖీలు పకడ్బందీగా చేపట్టాలి

సారంగాపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామాల్లో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ బృందాలు పకడ్బందీగా పరిశీలించాలని డీఆర్‌డీవో అడిషనల్ పీడీ మదన్‌మోహన్ అన్నారు. గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది, సామాజిక తనిఖీ బృందాలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు ఆయా గ్రామాల్లో ఉపాధిహామీ పథకం కింద రూ5.74 కోట్ల విలువైన పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ పనులపై 14వ సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నారు. సామాజిక తనిఖీ బృందాలు క్షేత్రస్థాయిలో పకడ్బందీగా పరిశీలన చేసి వాస్తవాలను తెలియపరచాలని సూచించారు. సమావేశంలో జల్లా అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి దేవేందర్‌రెడ్డి, ఎంపీడీవో గంగాధర్, డీఆర్‌పీ సాయికుమార్, ఎస్ఆర్‌పీ రమేష్, ఏపీవో శ్రీలత, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను సజావుగా జరపాలి

పెగడపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్లను సక్రమంగా జరపాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని దీకొండలో నంచర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ బీఎస్ లత గురువారం ప్రారంబించారు. దీకొండతో పాటు నంచర్ల, రాములపల్లి, రాంనగర్ కొనుగోలు కేంద్రాలను పరిశీలించి తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని తూకం వేసి వెంట వెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పించాలని, ప్యాడీ క్లీనింగ్ మిషన్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ మంత్రి వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు నామ సురేందర్‌రావు, డీసీవో మనోజ్‌కుమార్, తహసీల్దార్ రవీందర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మల్లేశం, గిర్దావర్ శ్రీనివాస్, సీఈవో మధూకర్, ఏపీఎం సమత ఉన్నారు.

మేడిపల్లి: మేడిపల్లి మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల వ్యవసాయ అధికారి షాహీద్ అలీ సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు కొనుగోలు కేంద్రాల నిర్వహకులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ప్యాక్స్ సీవో గోపి రైతులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు వాయిదా

మల్యాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం హుండీ సొమ్ముల లెక్కింపు శుక్రవారం నిర్వహించాల్సి ఉండగా వాయిదా వేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం యాదాద్రి పర్యటన నేపథ్యంలో అక్కడికి దేవాదాయశాఖ తరుపున ఈవో వెళ్లనుండడంతో వాయిదా వేసినట్లు తెలిసింది.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

వెల్గటూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోను ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీ గడ్డం వంశీ సూచించారు. మండలంలోని ముత్తునూర్ గ్రామంలో వెల్గటూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం నిర్వహించే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మి క్వింటాల్‌కు గ్రేడ్ ఏ రకానికి రూ.2320లు, సాధారణ రకానికి రూ.2300 మద్దతు ధర పొందాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపడతామన్నారు. కటింగ్ పేరిట రైతులను ఇబ్బందులకు గురిచేసిన మిల్లర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గన్నీ సంచులు, లారీల కొరత లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్, ఏఎంసీ చైర్మన్ గోపిక జితేందర్‌రెడ్డి, శైలేంధర్‌రెడ్డి, మద్దుల గోపాల్‌రెడ్డి, రాంమోహన్‌రావు, మెరుగు మురళి, ఉదయ్, శ్రీకాంత్‌రావు, మంజల, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గొల్లపల్లి (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వరంగ సంస్థల కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ధాన్యం విక్రయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ నిర్వాహకులను ఆదేశించారు. గురువారం గొల్లపల్లి మండలం చిల్వాకోడూర్ గ్రామంలో వానాకాలం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చెందోళి సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా ప్రభుత్వ విప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లు సాఫీగా, సజావుగా సాగేలా నిర్వాహకులు రైతులకు సరిపడా కనీస వసతులు కల్పించాలన్నారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని, ప్రభుత్వరంగ సంస్థల కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సంతోష్, వైస్ చైర్మన్ రాజిరెడ్డి, మాజీ చైర్మన్ హన్మాండ్లు, చెందోళి సింగిల్ విండో చైర్మన్ వెంకటమాధవ రావు, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నిశాంత్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు గౌతమ్ రాజు, నాయకులు దాసరి తిరుపతి, మజ్జు, వెంకటేష్, శ్రీనివాస్ రెడ్డి, నాగయ్య, మార్కెట్. సింగిల్‌విండో డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్, ఎంపీ

ఎండపల్లి (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటకు మద్దతు ధర ఇస్తూ రైతుల కళ్లలో ఆనందం నింపడమే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని మారేడుపల్లి, ముంజంపల్లి, ఉండెడా గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు గుండాటి గోపిక జితెందర్ రెడ్డి, తాటిపర్తి శైలేందర్ రెడ్డి, మద్దుల గోపాల్‌రెడ్డి, బయ్యపు మనోహర్‌రెడ్డి, బాలసాని మల్లేశం, గడ్డం లింగారెడ్డి, ఆవుల తిరుపతి, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

మెట్‌పల్లి రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆధునిక రంగాల్లో వచ్చిన అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పొలాస వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ యెల్లాగౌడ్ అన్నారు. పొలాస వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గురువారం మండలంలోని పెద్దాపూర్ గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విద్య అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు రత్నాకర్, ప్రజ్ఞా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా పేదలకు సంక్షేమ పథకాలు

- వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్


చెక్కును పంపిణీ చేస్తున్న విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ పేదలకు సంక్షేమ పథకాలను నిరంతరం కొనసాగిస్తోందని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో 29 మందికి కళ్యాణలక్ష్మి చెక్కులు, పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన అనంతరం మాట్లాడారు. దీర్ఘకాలిక వ్యాధులు, శస్త్ర చికిత్సల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరోగ్యశ్రీ పథకం కింద 10 లక్షల దాకా ఉచితంగా చికిత్సలు అందించాలని నిర్ణయించిందన్నారు. దీంతో పేదలకు ఎంతో మేలు చేకూరుతోందని చెప్పారు. అదేవిధంగా అత్యవసర చికిత్సల సమయంలో ఎల్‌వోసీలు అందిస్తూ వెంటనే శస్త్రచికిత్సలు పూర్తి చేయిస్తున్నామన్నారు. వచ్చే జనవరి నుంచి రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తామని తెలిపారు. 2009లో ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఎల్లంపల్లి స్టేజ్ 2 ఫేజ్ 1 పథకం కింద నాగారం, చందుర్తి, పాజుల్‌నగర్, రుద్రంగి చెరువుల మరమ్మతులను చేపట్టాలని నిర్ణయించగా బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. సూరమ్మ చెరువును ఓట్ల కోసం మాత్రమే వాడుకున్నారని తట్టెడు మట్టి కూడా తీసిన పాపాన పోలేదని ఆరోపించారు. ఇసుక కుప్పలు, యంత్రాలను చూపించి రైతులను మోసగించారని అన్నారు. కొద్ది రోజుల్లోనే కుడి, ఎడమ కాలువల నిర్మాణ పనులు ప్రారంభించబోతున్నామని ఇచ్చిన మాట తప్పబోమని చెప్పారు.

తమపై నమ్మకంతో ప్రజలు గెలిపించారని వారి ఆశలను వమ్ము చేయమని పేదలకు సేవ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోరు ట్ల ఆర్డీవో జితేందర్‌రెడ్డి, తహసీల్దార్ వినోద్, ఎంపీడీవో శంకర్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, పీసీసీ సభ్యుడు తొట్ల అంజయ్య, మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, జిల్లా కార్యదర్శి గోపిడి ధనుంజయ్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి ఎంఈవోగా సీతాలక్ష్మి



ధర్మపురి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల విద్యాధికారిగా (ఎంఈవో) సీతాలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు గురవారం ఆమెకు ప్రభుత్వ నియామకపు ఉత్తర్వులు అందించారు. మండలంలోని దొనూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో గెజిటెడ్ హెడ్‌మాస్టర్‌గా ఆమె బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అదనంగా ఆమె ఇన్‌చార్జి ధర్మపురి ఎంఈవోగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులు శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలి

జగిత్యాల అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని, శారీరక, మానసిక ఆరోగ్యంతోనే విద్యలో రాణించవచ్చని ఐఎంఏ జగిత్యాల అధ్యక్షుడు డాక్టర్ గూడూరి హేమంత్ అన్నారు. గురువారం కండ్లపెల్లి మోడల్ స్కూల్‌లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జగిత్యాల పట్టణ శాఖ ఆధ్వర్యం లో బాలికలకు అనీమియా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల్లో ప్రదానంగా రక్తహీనత సంబంధిత సమస్యలు లేకుండా ఆరోగ్య పరిరక్షణ జరుగాలని కోరారు. పాఠశాలలోని 6 నుంచి 12వ తరగతి వరకు 488 మంది బాలికలకు అనీమియా పరీక్షలు నిర్వహించగా అందులో 131 మంది రక్తహీనతతో బాధ పడుతున్నట్లు గుర్తించారు. వీరికి నెల రోజులకు సరిపడా మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐఎంఏ ప్రధాన కార్యదర్శి ఆకుతోట శ్రీనివాస్‌రెడ్డి, స్త్రీల వైద్య నిపుణులు వొద్నాల రజిత, గూడూరి శ్రీలత, అంకం అరుణ, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ గుండేటి అర్జున్, సాయి కిరణ్, కల్లెం దీపక్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ సరితా దేవి ఉన్నారు.


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

'డబుల్' ఇళ్లలో పనులను త్వరగా పూర్తిచేయాలి

- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్


డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాలరూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): డబల్ బెడ్‌రూమ్ ఇళ్లలో మౌలిక వసతుల పనులను త్వరగా పూర్తిచేయాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. గురువారం జగిత్యాల రూరల్ మండలంలోని అంతర్గాం గ్రామంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబల్‌బెడ్‌రూమ్ ఇళ్లకు విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ, సెప్టిక్ ట్యాంక్‌ల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ. 80 లక్షల నిధులు మంజూరు చేసిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈ మిలింద్, ఏఈ రాజమల్లయ్య స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మార్కెట్‌ను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలి

జగిత్యాల అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలో బిగ్ బజార్ వద్ద నాలుగు కోట్ల రూపాయలతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను వెంటనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అధికారులను ఆదేశించారు. బిగ్ బజార్‌లో నిర్మించిన కూరగాయలు, మాంసాన్ని విక్రయించే మార్కెట్ నిర్మాణం పూర్తయింది. కాగా బుధవారం మార్కెట్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే వీలైనంత త్వరలో మార్కెట్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి, కమిషనర్ చిరంజీవి, పబ్లిక్ హెల్త్ అధికారి సంపత్ రావు, చరణ్, చిక్కుల భూమయ్య, అధికారులు ఉన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన డీఎస్పీ


స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ రఘుచందర్

పెగడపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి పోలీస్‌స్టేషన్‌ను గురువారం జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందికి శాంతిభద్రతల అంశంలో పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మల్యాల సీఐ నీలం రవి, పెగడపల్లి ఎస్ఐ సీహెచ్ రవికిరణ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు

- జిల్లా వ్యవసాయాధికారి రామచందర్


రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రామచందర్

మెట్‌పల్లి రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విత్తనాలు, యూరియను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి రామచందర్ హెచ్చరించారు. గురువారం మండలంలోని జగ్గసాగర్ గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కేంద్రం, మెట్‌పల్లిలోని ఫర్టిలైజర్ షాపులను మండల వ్యవసాయాధికారి దీపికతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. షాపులలోని రికార్డులు పరిశీలించి విత్తనాలు, యూరియ స్టాకు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని పరిశీలించి త్వరగా తూకం వేసేలా చూడాలని, కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వహకులకు సహకరించాలన్నారు. 17శాతం ఉన్న ధాన్యాన్ని మాత్రమే తూకం వేయాలని పలు సూచనలు చేశారు. విత్తనాలు, ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని షాపు నిర్వహకులకు సూచించారు. షాపుల్లో రైతులు కొనుగోలు చేసిన వాటికి తప్పకుండా రసీదులు ఇవ్వాలని, ఈ పాస్ ద్వారానే యూరియను విక్రయించాలని పలు సూచనలు చేశారు. ఈయన వెంటా ఏఈవోలు నరేష్, భూమేశ్వర్, సిబ్బంది, నిర్వహకులు, తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యులకు అండగా..

నిరాశ్రయులకు కర్మకాండ వసతి గృహం

- నిరుపేదల అంత్యక్రియలకు రూ. ఐదు వేల ఆర్థికసహాయం
- ఆపద కాలంలో ఆదుకుంటున్న రామకృష్ణ సేవా సమితి ఆదర్శం

చొప్పదండి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) అద్దె ఇంటిలో ఉన్న వారిలో ఎవరైనా మరణిస్తే కర్మకాండలు నిర్వహించేందుకు ఇంటి యజమానులు ఒప్పుకోని సంఘటనలు ఎన్నో ఎదురవుతున్నాయి. ఎక్కడ ఉండాలో.. ఏం చేయాలో.. ఎటూ పాలు పోని పరిస్థితులను ప్రస్తుతం అనేక మంది ఎదుర్కుంటున్నారు. ఇటువంటి వారికోసం రామకృష్ణ సేవా సమితి దాతల సహకారంతో చొప్పదండిలో నిరాశ్రయుల కర్మకాండ వసతి గృహాన్ని నిర్మించి, నిర్వహిస్తుంది. సొంత ఇల్లు లేని అనేక మందికి కర్మకాండ భవనంలో ఆశ్రయం కల్పించింది.

రామకృష్ణ పరమహంస ప్రేరణ, స్వామి వివేకానంద బోధనలు, రచనలకు ప్రభావితమై 2013లో చొప్పదండి కేంద్రంగా రామకృష్ణ సేవా సమితిని ఏర్పాటు చేశారు. నిరుపేద కుటుంబంలో ఎవరైనా మరణిస్తే అంత్యక్రియల నిర్వహణ కోసం ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని సేవా సమితి అందజేస్తోంది. కొవిడ్ కాలంలో మరణాలు సంభవించిన సమయంలో కర్మకాండలు నిర్వహించడం కష్టతరంగా మారడంతో నిరాశ్రయుల కర్మకాండల వసతి గృహం నిర్మాణం కోసం రామకృష్ణ సేవా సమితి ముందుకు వచ్చింది. చొప్పదండికి చెందిన పారుపెల్లి లక్ష్మి, వెంకటి జ్ఞాపకార్థం వారి కుమారుడు భవన నిర్మాణం కోసం 35 లక్షల రూపాయల విరాళాన్ని అందజేశారు. నిరాశ్రయుల కర్మకాండల వసతి గృహాన్ని చొప్పదండిలో శివ కేశవ ఆలయ సమీపంలో నిర్మించారు. నిర్వహణ కోసం మరో ఆరు లక్షల రూపాయలను సేవా సమితి సేకరించింది.

● నాలుగు గదులు.. 11 రోజులు ఆశ్రయం

వసతి గృహంలో నాలుగు గదులను ఏర్పాటు చేయగా నాలుగు కుటుంబాలు ఆశ్రయం పొందవచ్చు. ఒక్కో కుటుంబం 11 రోజుల నుంచి నెల రోజుల వరకు ఆశ్రయం పొందుతున్నారు. తాగు నీటితో పాటు వంట చేసుకోవడానికి అన్ని ఏర్పాట్లు గదుల్లో ఉన్నాయి. నిరుపేదలకు అవసరమైతే నిత్యావసర వస్తువులను సేవా సమితి అందజేస్తుంది. చొప్పదండితో పాటు పొరుగు మండలాల నుంచి ఆశ్రయం కోసం అనేక మంది ఈ వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్నారు. అంత్యక్రియల తరువాత మూడో రోజు నుంచి 11వ రోజు వరకు అన్ని కర్మలు నిర్వహించేందుకు వసతి గృహంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

దాతల సహకారంతో మర్ని వసతులు

- చెట్ల రాంకిషన్(గౌరవ అధ్యక్షుడు, రామకృష్ణ సేవా సమితి)



నిరాశ్రాయుల కర్మకాండ వసతి గృహం నిరుపేదలకు అండగా నిలుస్తుంది. దాతల సహకారంతో మరిన్ని వసతులను కల్పించేందుకు కృషి చేస్తాం.



కర్మకాండ భవనం



కర్మకాండ భవనంలో సహపంక్తి భోజనాలు

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కరీంనగర్ క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కరీంనగర్ అర్బన్ ఎక్సైజ్ సీఐ జి రాము అన్నారు. పట్టణంలోని రాంనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కాన్షియస్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. అనంతరం సీఐ రాము మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మత్తు పదార్థాల బారినపడి చేజేతులా భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, చైల్డ్ కేఫ్, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది రమేష్, సంపత్, ఎక్సైజ్ శాఖ సిబ్బంది శ్రీకాంత్‌రెడ్డి, జగన్, సారిక తదితరులు పాల్గొన్నారు.

శిఖం భూములను కాపాడాలి



ఆర్ఐ ప్రవీణ్‌తో వాగ్వాదం చేస్తున్న తండా వాసులు

వీర్నపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చెరువు శిఖం భూములను కాపాడాలని వీర్నపల్లి మండలంలోని వన్ పల్లి కేలోత్ తండా గ్రామస్థులు గురువారం ఆందోళనకు దిగారు. సర్వే కోసం తండాకు వచ్చిన ఆర్ఐ ప్రవీణ్‌తో వాగ్వాదానికి దిగారు. భూములు కబ్జాకు గురవుతున్నాయని, అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువుకు సంబంధించిన భూమికి ఎలా పట్టాలిస్తారని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు స్పందించాలని, భూమిని ఆక్రమించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని తండావాసులను అక్కడి నుంచి పంపించారు.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న రేషన్ బియ్యం

తంగళ్లపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 48 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకుని ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాంమోహన్ తెలిపారు. గురువారం తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామం నుంచి మినీవ్యాన్‌లో బియ్యం తరలిస్తున్నరనే సమాచారంతో తంగళ్లపల్లి పోలీసులు, జిల్లా టాస్క్‌పోర్సు పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. 48 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని తరలిస్తున్న, కొనుగోలు చేస్తున్న జిల్లెలకు చెందిన గాండ్ల నితిన్, పాండు, రాజు, గుగు లోతు అంగుర నెరెళ్ల గ్రామానికి చెందిన డ్రైవ ర్లు శ్రీను, ప్రశాంత్‌తోపాటు వేములవాడ మండలం వట్టిముల గ్రామానికి చెందిన సముద్రాల ప్రశాం త్‌పై కేసు నమోదు చేశారు. తనిఖీల్లో టాస్క్‌ఫోర్సు ఎస్సై సుధాకర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బావిలో పడి వృద్ధురాలి మృతి

సుల్తానాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపూర్ గ్రామంలో ఓ వృద్ధురాలు ప్రమాదవశాత్తు బావిలో పడి మరణించిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. నారాయణపూర్ గ్రామానికి చెందిన ముత్యాల పోచమ్మ(81) కళ్లు సరిగా కనబడకపోవడంతో రోడ్డుపై నడుచుకుంటూ వెళుతూ ప్రమాదవశాత్తు బావిలో పడిపోయిందని గ్రామస్థులు తెలిపారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు మృతదేహాన్ని తీయించి పోస్టుమార్టం నిమిత్తం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎన్నికల హామీని నిలబెట్టుకున్నాం



చెగ్యాంలో మాట్లాడుతున్న విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

వెల్గటూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ముంపు గ్రామం చెగ్యాం నిర్వాసితులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నానని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన రూ.18 కోట్ల ముంపు నష్ట పరిహారానికి సంబంధించిన మిగులు చెక్కులను గురువారం మండలంలోని చెగ్యాం గ్రామంలో ఎంపీ గడ్డం వంశీతో కలిసి నిర్వాసితులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ ఎల్లంపల్లి ప్రాజెక్టు భూ నిర్వాసితులకు సంబంధించి మిగిలిన 63 మంది లబ్ధిదారుల నష్టపరిహారానికి చెందిన చెక్కులను ఎంపీ వంశీతో కలిసి పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఎన్నికల సమయంలో తాను బాధితులకు పరిహారం ఇప్పిస్తానని ఇచ్చిన హామీ నిలబెట్టుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణంతో ఈ ప్రాంత ప్రజలు భూములను కోల్పోయినప్పటికీ పరిహారం అందించే విషయంలో గత బీఆర్‌ఎస్ నాయకులు పట్టించుకోలేదని తెలిపారు. చెగ్యాం గ్రామాన్ని ముంపు ప్రాంతంగా ప్రకటించడంలో దివంగత కాక వెంకటస్వామి పాత్ర ఎంతో ఉందని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ముంపు బాధితుల పరిహారం కోసం చేసిన ప్రతీ నిరసనలో, ధర్నాలో వారి వెంట ఉండి ధైర్యాన్నిచ్చామని గుర్తుచేశారు. అర్హత ఉండి పరిహారం అందని వారు ఇంకా ఎవరైనా ఉంటే వారికి కూడా పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకుం టామని తెలిపారు.

● భూ నిర్వాసితుల కలనెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం

చెగ్యాం భూ నిర్వాసితుల కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ పేర్కొన్నారు. తన తాత వెంకటస్వామి హయాంలో రూపకల్పన చేసిన ఎల్లంపల్లి ప్రాజెక్టు పరిహారం చెక్కుల పంపిణీలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. పది సంవత్సరాల కాలంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎల్లంపల్లి భూ నిర్వాసితులకు న్యాయం చేయలేదన్నారు. ప్రభుత్వం కష్టాల్లో ఉన్నప్పటికీ ప్రజల సంక్షేమం గురించి ఆలోచిస్తూ సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ శేఖర్, ఏఎంసీ చైర్మన్ గోపిక జితేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయాన్ని తాకట్టు పెట్టుకొని రుణం ఇవ్వండి

- బ్యాంక్ మేనేజర్‌కు మాజీ సర్పంచ్ భర్త వినతి

మేడిపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యాలయాన్ని తాకట్టు పెట్టుకొని తనకు రుణం ఇవ్వాలని ఓ మాజీ సర్పంచ్ భర్త దక్కన్ గ్రామీణ బ్యాంక్ (డీజీబీ) మేనేజర్‌కు గురువారం వినతి పత్రాన్ని సమర్పించారు. జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలంలోని తొంబర్రాపేట గ్రామానికి చెందిన మామిడి సత్తమ్మ-ధర్మారెడ్డి సర్పంచ్‌గా ఉన్న సమయంలో అప్పులు చేసి గ్రామ అభివృద్ధి కార్యక్రమాలు చేశారు. గత సంవ త్సరం ఉపాధి హామీ నిధులు 20 లక్షల రూపా యలతో గ్రామపంచాయతీ భవన నిర్మాణా నికి ప్రతిపాదనలు చేశారు. 18 లక్షల రూ పాయలు వెచ్చించి భవనాన్ని నిర్మించారు. ఇంకా కొంత పని చేయాల్సి ఉంది. బిల్లుల కోసం అధికారుల చుట్టూ తిరిగాడు. వారం రోజుల క్రితం 7.46 లక్షల రూపాయలు విడుదలయ్యాయి. మిగతా బిల్లులు రాలేదు. తాను అప్పులు చేసి గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మించానని, బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నానని మాజీ సర్పంచ్ సత్తమ్మ భర్త ధర్మారెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. తాను నిర్మించిన గ్రామపంచాయతీ కార్యా లయాన్ని తాకట్టు పెట్టుకొని తనకు అప్పు ఇవ్వాలని, ప్రభుత్వం నుంచి బిల్లు రాగానే వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తానని దక్కన్ గ్రామీణ బ్యాంక్ బ్యాంకు మేనేజర్‌కు గురువారం వినతిపత్రం సమర్పించాడు.



బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ సర్పంచ్ భర్త ధర్మారెడ్డి

ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్థులు

మానకొండూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటూర్ గ్రామంలో గురువారం రాత్రి మానేరు వాగు నుంచి ఇసుక తరలిస్తున్న లారీలను గ్రామస్థులు అడ్డుకున్నారు. గ్రామ శివారులోని మానేరు వాగు నుంచి పగలు రాత్రి అనే తేడా లేకుండా లారీలతో ఇసుకను తరలించడం వల్ల దుమ్ము, ధూళితో ఇబ్బదులు పడుతున్నామని చెప్పారు. రోడ్లు అన్ని ధ్వసమవుతున్నాయని గ్రామస్థులు ఆరోపించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్థులతో చర్చించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

గంభీరావుపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలో తాళం వేసి ఉన్న ఇంట్లో బుధవారం రాత్రి చోరీ జరిగింది. దేవవ్వ పిల్లలు చదవులు నిమిత్తం హాస్టల్ ఉంటున్నారు. దేవవ్వ భర్త సత్యంకు వైద్యం చేయించేందుకు ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లింది. రాత్రి ఇంటి తాళాలు పగుల గొట్టిన దొంగలు 2 తులాల బంగారు, 34 తులాల వెండి వస్తువులు ఎత్తుకెళ్లారు.

ఆభరణాలు తీసుకొని మోసం

- కేసు నమోదు

కరీంనగర్ క్రైం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఒక శుభకార్యానికి వెళ్లేందుకు ఆభరణాలు కావాలని తీసుకుని తిరిగి ఇవ్వకుండా బెదిరింపు లకు పాల్పడిన నిందితురాలిపై కేసు నమోదు చేశామని కరీంనగర్ మూడో టౌన్ పోలీసులు తెలిపారు. బ్యాంక్ కాలనీకి చెందిన చెన్నమల్ల లక్ష్మి వద్ద అక్టోబరు 21న అదే ప్రాంతానికి చెందిన మడనాటి అరుణ 4 తులాల బంగారు ఆభరణాలు, 15తులాల వెండి గొలుసులను తీసుకుని శుభకార్యం తరువాత తిరిగి ఇస్తానని నమ్మబలికిందని బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. తన బంగారు, వెండి ఆభరణాలు తిరిగి ఇవ్వాలని బాధితురాలు కోరగా బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు నిందితురాలిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి మహిళ మృతి

వెల్గటూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండల కేంద్రానికి చెందిన బండమీది రాజమణి (56) అనే మహిళ గురువారం ఫిట్స్ రావడంతో ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందింది. ఎస్సై ఉమా సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజమణి పుట్టుకతో ఫిట్స్ వ్యాధితో బాధపడుతోంది. వివాహం అయినప్పటికీ ఫిట్స్ వ్యాధి కారణంగా విడాకులు అయ్యాయి. అప్పటి నుంచి తల్లి గౌరమ్మ దగ్గర ఉంటోంది. కాగా గురువారం మంచి నీటి కోసం ఇంటి వెనుక గల బావి దగ్గరుకు వెళ్లింది. ఎంతసేపైనా రాకపోయే సరికి చుట్టుపక్కల వెతికారు. అనుమానం వచ్చి పాతాళగరిగెతో బావిలో వెతకగా ఆమె మృతదేహం బయటపడింది. రాజమణి తల్లి గౌరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పోలీసుల కార్డన్ సెర్చ్



గోదావరిఖనిలో వివరాలు తెలుసుకుంటున్న సీఐ ఇంద్రసేనారెడి

కోల్‌సిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పట్టణంలోని గంగానగర్ ఏరియాలో గురువారం వన్‌టౌన్ పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ ఇంద్రసేనారెడ్డి నేతృత్వంలో ప్రతి ఇంటిని తనిఖీ చేసి, వివరాలను తెలుసుకున్నారు. ధ్రువీకరణ పత్రాలు లేని ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించి జరమానాలు విధించారు. 13 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకుని వాటి యజమానుల వివరాలు తెలుసుకుని వారికి అప్పగించారు. గంగానగర్ ఏరియాలో అనుమానితులు కనబడితే సమాచారం ఇవ్వాలని, అపరిచితులకు ఆశ్రయం కల్పించవద్దని సీఐ ఇంద్రసేనారెడ్డి స్థానికులకు సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్ ద్వారా మోసాలు చేసే అవకాశాలు ఉన్నందున అపరిచిత ఫోన్‌కాల్స్‌కు బ్యాంక్ ఖాతాల, ఓటీపీ, ఏటీఎం నంబర్లు వంటివి చెప్పవద్దని సూచించారు. ఈ కార్డన్‌సెర్చ్‌లో ఎస్సైలు, కానిస్టేబుళ్లు సిబ్బంది పాల్గొన్నారు.



కేసీఆర్‌నగర్ కాలనీవాసులతో మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి

తంగళ్లపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం మండెపల్లి కేసీఆర్‌నగర్‌లో పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. అనుమానిత వ్యక్తులు తదితర అంశాలపై ఆరా తీశారు. ద్విచక్ర వాహనాల పత్రాలను పరిశీలించారు. టెక్స్‌టైల్ పార్కు గేట్ వద్ద తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లడుతూ అను మానిత వ్యక్తులు సంచరించినా, అసాంఘీక కార్యక్ర మాలు జరిగినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు వినియోగించినా, విక్రయించినా వారి వివరాలు పోలీసులకు అందించాలని సూచించారు. పోలీసులకు సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. యువత వ్యసనాల బారిన పడకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సీఐ మొగిలి, ఎస్ఐ రాంమోహన్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ మహిళ మృతి

శంకరపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం తాడికల్ గ్రామంలో పాముకాటుకు గురైన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంగల దేవి (41) అనే మహిళ ఈ నెల 4న ఉదయం పాడి ఆవును మేతకు వ్యవసాయ పొలం వద్దకు తీసుకెళ్తుండగా కుడికాలుపై పాముకాటు వేసింది. దేవి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు తెలుపడంతో హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు జమ్మికుం టలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి తిరిగి హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి గురువారం ఉదయం తీసుకువచ్చారు. డాక్టర్ పరీక్షించి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. దేవి భర్త వెంగల కుమార స్వామి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడ్డ యువకుడు..

ఓదెల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిపురం గ్రామానికి చెందిన గ్యారవేణి శ్రీనివాస్ (40) అనే యువకుడు గురువారం హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. వారం క్రితం శ్రీనివాస్ హరిపురం నుంచి కొలనూర్ వైపు వెళుతున్న క్రమంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు గుర్తించి హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ఇల్లందకుంట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోగంపాడు గ్రామానికి చెందిన జిల్లెల మల్లారెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. మల్లారెడ్డి తన స్కూటీపై వస్తుండగా వెనుక నుంచి సీతంపేట గ్రామానికి చెందిన చిలుక అజయ్ తన బైక్‌ను అతి వేగంగా అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చి ఢీకొట్టాడు. మల్లారెడ్డి కింద పడగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మల్లారెడ్డి కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు.

అప్పులు ఇచ్చిన వారి వేధింపులు భరించలేక తల్లీకూతుళ్ల ఆత్మహత్యాయత్నం

ముస్తాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అప్పుల ఇచ్చిన వారి వేధింపులు తాళ లేక తల్లీకూతుళ్లు ఆత్మహత్యకు యత్నించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని మోర్రాయిపల్లెకు చెందిన గుండం బాలమల్లు ఏడాది క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. బాలమల్లు అనారోగ్యంతో ఉన్నప్పుడు రూ. 20 లక్షల వరకు అప్పులు చేశాడు. అతడు మరణించిన తర్వాత అప్పులు తీర్చాలని అతడి భార్య మంజుల, కూతురు అఖిలను అప్పులు ఇచ్చిన వారు వేధిస్తున్నారు. గురువారం ఉదయం వారి ఇంటికి వచ్చి ఇష్టారీతిన మాట్లాడంతో ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకొని ఉరేసుకున్నారు. గమనించిన స్థానికులు తలుపులు బలవంతంగా తెరిచి వెంటనే వారిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. తల్లి మంజుల ప్రాణాపాయ స్థితి నుం చి బయటపడింది. అఖిల పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

డబ్బులు ఇస్తానంటూ మోసం

- పోలీసులకు అప్పగించిన గ్రామస్థులు



నిందితుడిని చెట్టుకు కట్టేసిన గ్రామస్థులు

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెగడపల్లిలో ఓ గుర్తుతెలియని వ్యక్తి డబ్బులు ఇస్తానంటూ మోసానికి పాల్పడ్డాడు. గ్రామంలో కిరాణా షాపు నడుపుతున్న సుమలత అనే మహిళ వద్దకు గురువారం వెళ్లి ఎస్సీ కాలనీ దగ్గర ఇల్లు ఉంటుందని, 50వేల రూపాయలు ఫోన్ పే చేస్తే డబ్బులు ఇస్తానంటూ నమ్మబలికాడు. దీంతో ఆమె డబ్బులు పంపగా, మరో 30 వేలు పంపాలని కోరాడు. ఆమె తన వద్ద డబ్బులు లేవని చెప్పినా వినకపోవడంతో ఆమె పోలీసులు, గ్రామస్థులకు సమాచారం అందించింది. చుట్టుపక్కల వారు వచ్చి అతడిని నిలదీయగా ఆ డబ్బులు వేరే నంబర్‌కు వెళ్లాయని, తన దగ్గర డబ్బులు లేవని చెప్పడంతో పాటు తప్పించుకునే ప్రయత్నం చేశాడు. దీంతో గ్రామస్థులు అతడిని చెట్టుకు కట్టేశారు. పోలీసులు నిందితుడిని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


ఇబ్రహీంపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండలింగాపూర్ శివారులో గురువారం జాతీయ రహదారి పక్కన ఉన్న బావిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.. రహదారి పక్కన ఉన్న బావిలో వ్యక్తి దాదాపుగా 30 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు తెలిపారు. మృతుడి ఒంటిపై బూడిద కలర్ టీ షర్ట్, నలుపు రంగు జీన్స్ ప్యాంట్ ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని గుర్తుపట్టిన వారు మెట్‌పల్లి సీఐ 8712656819, ఇబ్రహీంపట్నం ఎస్ఐ 8712524667 నంబర్లను సంప్రదించాలని ఎస్ఐ అనిల్ కోరారు.

మున్సిపల్ ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- ఆరుగురు పారిశుధ్య కార్మికులకు గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం

కోరుట్ల, నవంబర్ 7(ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో విధులు నిర్వహించాడానికి మున్సిపల్ ట్రాక్టర్‌లో వెళ్తున్న పారిశుధ్య కార్మికుల ట్రాక్టర్‌ను ఆర్టీసీ బస్సు గురువారం ఉదయం ఢీకొట్టింది. బోధన్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ట్రాక్టర్‌ను ఢీ కొట్టగా ఘటనలో ఆరుగురికి గాయలుకాగా ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. మున్సిపల్‌లో విధులు నిర్వహిస్తున్న రాగుల కనకతార, బొల్లె కార్తీక్, బైరి రాధ, సుగుణ, గంగు, రేణుకకు గాయాలు అయ్యాయి. ఇందులో కనకతార, కార్తీక్ పరిస్థితి విషమంగా ఉంది. కాగా రాగుల కనకతార ప్రస్తుతం గర్భిణి. పోలీస్‌లు, మున్సిపల్ సిబ్బంది అక్కడకు చేరుకొని గాయాలపాలైన కార్మికులను జగిత్యాల ప్రభుత్వ అసుపత్రికి తరలించారు.

అదుపు తప్పి కారు బోల్తా



బోల్తా పడిన కారు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామ శివారులోని గురువారం కారు అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో యువకుడికి స్వల్ప గాయాలయ్యాయి. మండలంలోని రాజన్నపేటకు చెందిన తేజక గొల్లపల్లి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో కారు టైర్ పగిలి ప్రమాదానికి గురైందని స్థానికులు పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యం.. కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, నవంబరు7(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో కంఠం సరళ అనే వివాహిత అదృశ్యమైనట్లు కేసు నమోదు చేశామని ఎస్‌హెచ్‌వో, హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ గురువారం తెలిపారు. గ్రామంలోని నర్సయ్య పెద్ద కూతురు సరళకు అదే గ్రామానికి చెందిన ఉదయ్‌తో 2013లో వివాహమైంది. నర్సయ్యకు కొడుకు లేకపోవడంతో కూతురు సరళ, అల్లుడు ఉదయ్ అతడి వద్ద ఉంటూ జీవిస్తున్నారు. ఈ నెల 6న సరళ రాత్రి వంట చేయకపోవడంతో తండ్రి నర్సయ్య మందలించాడు. దీంతో ఆమె ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. చుట్టు పక్కల, బంధువుల వద్ద గాలించిన ఆచూకీ లభించలేదని తెలిపారు. బాధితుడు నర్సయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ వివరించారు.

కొనసాగుతున్న గోదావరి హారతి



ధర్మపురి వద్ద గోదావరి హారతి ఇస్తున్న అర్చకులు, భక్తులు

ధర్మపురి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో ఆరో రోజు గురువారం గోదావరి హారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం పురస్కరించుకుని స్థానిక లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు, మహిళలు మంగళ వాయిద్యాలు వెంటరాగా గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు గోదావరి నది వద్ద విశేష పూజలు జరిపారు. అనంతరం రాత్రి నదీ మాతకు హారతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, వేదపండితులు పాలెపు ప్రవీణ్ శర్మ, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచారి, నరసింహమూర్తి, ఆలయ అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు అరుణ్‌కుమార్, అశ్విన్, వంశీకృష్ణ, విజయ్, నవీన్, మోహన్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో కొనసాగుతున్న కార్తీక రద్దీ



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో కార్తీక రద్దీ కొనసాగుతోంది. గురువారం రాజన్న ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు ఆలయ ముందు భాగంలోని రావిచెట్టు ముందు కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ధర్మదర్శనం, శీఘ్ర దర్శనం క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకొని పార్వతీ పరమేశ్వరు లను దర్శించుకున్నారు. కోడెమొక్కులు చెల్లించు కున్నారు. అనంతరం గండ దీపంలో నూనె పోస్తూ గండాలు తొలగిపోవాలని వేడుకున్నారు.

చదరంగంతో ఆలోచనా శక్తి పెంపు



చదరంగం పోటీలను ప్రారంభిస్తున్న డీవైఎస్‌వో శ్రీనివాస్

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చదరంగంతో ఆలోచనా శక్తి పెంపొందుతుందని డీవైఎస్‌వో శ్రీనివాస్, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి వేణుగోపాల్ అన్నారు. ఎస్‌జీఎఫ్ అండర్-17, అండర్-14 బాల బాలికల ఉమ్మడి జిల్లా చదరంగ పోటీలు గురువారం జీనియస్ చెస్ అకాడమీలో ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీవైఎస్‌వో శ్రీనివాస్, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి వేణుగోపాల్ మొదటి ఎత్తు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదరంగంలో జిల్లా క్రీడాకారులు విశేష ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శంకరయ్య, జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్ కంకటి అనూప్ కుమార్, రాజ్‌కుమార్, శ్రీనివాస్‌రావు, సృజన్‌కుమార్, సతీష్‌బాబు, చీఫ్ ఆర్బిటర్ తరుణ్, ఆర్బిటర్లు, రేవిక్, నితిన్, శ్రీనిజ, పీఈటీలు పాల్గొన్నారు.

పాడితో లాభాలు

- డెయిరీల ఏర్పాటుతో స్వయం ఉపాధి
- మేలైన జాతి ఆవులు, గేదెలతో మంచి పాల దిగుబడి

రైతులు వ్యవసాయానికి అనుబంధంగా పాడి పశువులను పెంచుతూ అదనపు ఆదాయాన్ని పొందుతున్నారు. మేలైన పశువులను ఎంచుకుని మంచి పాల దిగుబడిని సాధిస్తున్నారు. పాలను తామే అమ్ముకుంటూ లాభాలు సాధిస్తున్నారు. సైదాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో యువకులు, రైతులు పాడి పరిశ్రమ వైపు మొగ్గు చూపుతున్నారు.

◆ సైదాపూర్



అనిల్ డెయిరీ ఫామ్‌లో ఆవులు



ఆవులకు వేసేందుకు గడ్డిని చిన్న చిన్న ముక్కలు కట్ చేస్తున్న అనిల్

■ జాగీర్‌పల్లి గ్రామానికి చెందిన ఉప్పారు అనిల్ అనే యువకుడు డిగ్రీ పూర్తి చేశాడు. తల్లితండ్రులను వదిలి ఎక్కడికో ఉద్యోగం చేయడానికి వెళ్లడం ఎందుకు అని ఆలోచించి డెయిరీ ఫామ్ పెట్టుకున్నాడు. కేడీసీసీ బ్యాంక్ నుంచి 20 లక్షల రూపాయల రుణం తీసుకున్నాడు. ఇతర రాష్ట్రాలకు వెళ్లి 14 పాడి ఆవులు, ఒక గేదెను తీసుకొచ్చాడు. వాటికి షెడ్డు ఏర్పాటు చేసి తమ వ్యవసాయ భూమిలో గడ్డిని పెంచుతూ మేతగా ఇస్తున్నాడు. డెయిరీ ఫామ్‌లో తనకు సహాయంగా బిహార్‌కు చెందిన ఓ యువకుడిని జీతంగా పెట్టుకున్నాడు. వీరిద్దరు ప్రతి రోజు ఆవుల పోషణ చూస్తూ పాలు పితుకుతూ మార్కెట్‌కు పంపిస్తారు. అనిల్ ప్రస్తుతం నెలకు ఖర్చులు పోను 60 వేల రూపాయల వరకు సంపాదిస్తున్నాడు. పశువుల ద్వారా వచ్చిన ఎరువును భూమిలో వేసుకుంటున్నాడు.

సంతృప్తిగా ఉంది.

- ఉప్పారపు అనీల్, యువ రైతు, జాగీర్‌పల్లి



ఎక్కడో ఉద్యోగం చేస్తూ ఇబ్బంది పడడం కన్నా సొంతగా డెయిరీ ఫామ్ నడుపుకోవడం సంతృప్తిగా ఉంది. ప్రస్తుతం 15 పాడి పశువులను పెంచుతున్నాను. అన్ని ఖర్చులు పోనూ నెలకు 70వేల వరకు మిగులుతున్నాయి. కుటుంబ సభ్యుల మధ్య సొంత ఊరిలో పని చేసుకోవడం సంతృప్తిగా ఉంది.



డెయిరీఫామ్‌లో రవీందర్ రెడ్డి

■ మండలంలోని దుద్దెనపల్లికి చెందిన చెప్యాల రవీందర్ 13 గేదెలతో, తాటిపెల్లి సీతారాం 12 గేదెలు, ఆవులతో డెయిరీ ఫామ్ నిర్వహిస్తున్నారు. వీరు ఆరు సంవత్సరాలుగా పశు పోషణ చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. చెప్యాల రవీందర్ సైదాపూర్ మండల కేంద్రంలో ఓ గదిని తీసుకుని తమ ఫామ్ నుంచి వచ్చిన పాలను అమ్ముతున్నాడు. ఖర్చులు పోను నెలకు 50 వేల రూపాయల వరకు మిగులుతున్నాయని వారు అంటున్నారు. వ్యవసాయంతోపాటు డెయిరీ ఫామ్ నడపడం వల్ల లాభదాయకంగా ఉందని వారు తెలిపారు. పని వాళ్లపై భారం వేయకుండా యజమానులు దగ్గరుండి పశువులను చూసుకుంటే మంచి లాభాలు సాధించవచ్చని వారంటున్నారు.

లోకల్‌గా పాలు అమ్మితే లాభాలు వస్తాయి

- చెప్యాల రవీందర్‌రెడ్డి, డెయిరీ ఫామ్ నిర్వాహకుడు, దుద్దెనపల్లి



నేను 13 సంకర జాతి గేదెలను తెచ్చి ఆరు సంవత్సరాలుగా డెయిరీ ఫామ్ నిర్వహిస్తున్నాను. మంచి లాభాలు వస్తున్నాయి. పెట్టిన పెట్టుబడి పూర్తిగా వచ్చింది. సైదాపూర్ మండల కేంద్రంలో రూం తీసుకొని ప్రతీ రోజు ఉదయం ఏడు గంటల వరకు గేదె పాలు అమ్ముతున్నాను. మంచి లాభం వస్తుంది. ప్రతీ నెల ఖర్చులు పోను 50 వేల రూపాయల వరకు మిగులుతున్నాయి.

న్యూస్ బాక్స్

రూ.6,900 పలికిన పత్తి ధర

జమ్మికుంట, నవంబర్ 07 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 6,900 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 128మంది రైతులు 1,239క్వింటాళ్ల విడి పత్తి, ఏడుగురు రైతులు 13క్వింటాళ్ల గోనె సంచుల్లో పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 6,900, కనిష్ఠ ధర 6,200 రూపాయలు చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

డీఎస్పీల బదిలీ

కరీంనగర్ క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని పలువురు డీఎస్పీల బదిలీలు జరిగాయి. ఈ మేరకు డీజీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. జగిత్యాల డీసీఆర్‌బీలో పనిచేస్తున్న డీఎస్పీ జి మహేష్‌బాబును కరీంనగర్ పీటీసీ డీఎస్పీగా బదిలీ చేశారు. అలాగే కరీంనగర్ పీటీసీలో పనిచేస్తున్న బి రామానుజంను ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ డీఎస్పీగా బదిలీ చేశారు. కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ ఆసిఫాబాద్ డీఎస్పీగా, ఆసిఫాబాద్ డీఎస్పీ పి సదయ్యను హైదరాబాద్ చీఫ్ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నిర్మల్ డీసీఆర్‌బీ డీఎస్పీగా పనిచేస్తున్న పి రవీందర్‌రెడ్డి ఖమ్మం సీసీఆర్‌బీ ఏసీపీగా బదిలీ చేశారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని మరికొందరు ఏసీపీలకు త్వరలో బదిలీలు జరుగను న్నట్లు సమాచారం. ఇందులో కొందరు ఏసీపీలకు పదోన్నతులు రానున్నాయి.

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు సైనిక స్కూల్ విద్యార్థుల ఎంపిక

చొప్పదండి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రుక్మాపూర్ సైనిక స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యారు. అండర్-17 విభాగంలో స్వరూప్, నరేష్, విజయ్‌కుమార్, అరవింద్, రాంసుధీర్, వర్షిత్‌కుమార్ ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో శ్రీసాయి, అజయ్, పునీత్ చంద్ర, చంద్రశీల, శశివదన్, మహేష్, సాహూ మహరాజ్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యారు.

ఆలయ హుండీ లెక్కింపు

మానకొండూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గట్టుదుద్దెనపల్లి ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ హుండీని గురువారం లెక్కించారు. హుండీ ద్వారా 2.42.389 రూపాయల ఆదాయం వచ్చినట్లు కార్యనిర్వాహణాధికారి మారుతి తెలిపారు.

డెడికేషన్ కమిటీ ఏర్పాటు హర్షణీయం


- వెనుకబడిన వర్గాల్లో ఆశలు చిగురింపజేస్తున్న కులగణన సర్వే - ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సామాజికంగా, ఆర్థికంగా వెనుకబాటుతనానికి గురైన బీసీలకు రాజ్యాంగబద్ధంగా కల్పించాల్సిన రిజర్వేషన్ సౌకర్యాల కోసం డెడికేషన్ కమిషన్ ఏర్పాటు చేయడం హర్షణీయమని ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బలహీన వర్గాల అభ్యున్నతిలో భాగంగా రాజ్యాంగబద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం డెడికేషన్ కమిటీ వేసిందన్నారు. బలహీన వర్గాలకు స్థానికసంస్థల్లో రిజర్వేషన్ల కల్పనకు ఉమ్మడి రాష్ట్రంలోనే చట్టం రూపొందించారన్నారు. 2004లో యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ ఆలోచ నలకు అనుగుణంగా అల్పసంఖ్యాక వర్గాలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. బలహీన వర్గాల న్యాయం చేయాలనే తలంపుతోనే రాహుల్ గాంధీ వివరాలు సేకరించేందుకు సర్వే చేయాలని ఆదేశించారన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లోనే కులగణన అంశం ప్రస్తావించడంతో ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. సర్వేతో ప్రజలకు ఇబ్బం దులు కలగకుండా చూడాలని సీఎంకు లేఖ రాశానని అందులో సర్వే చేసే రోజు సమాచారం ఉండేలా చూడాలని కోరానన్నారు. కొందరికి ఇంటి నంబర్లు లేక బయట గుడిసెలు వేసుకోని ఉన్నారని, కొందరు సంచార జాతులు కూడా ఉన్నారని అలాంటి వారిపై కూడా ప్రత్యేక దృష్టి సారించి స్పష్టమైన వివరాలు సేకరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సర్వేకు ప్రజలు అందుబాటులో ఉండి సహకరించాలని కోరారు. గత ప్రభుత్వం 2014లో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే నేటికీ బహిర్గతం కాలేదన్నారు. ప్రజాసంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకత, చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. పనిచేసే ప్రభుత్వంపై అక్కసుతోనే ప్రతిపక్షాలు విమర్శలు చేయడం సహజం అన్నారు. నవంబరు నెలలోనే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని, గ్రామసభల ద్వారా అర్హులను ఎంపిక చేసి నిర్ణయం తీసుకుంటారన్నారు. సర్వేపై ప్రజలు అపోహలు పడొద్దని, ఆందోళన చెందవద్దని కోరారు. సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ జీవ న్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతిలక్ష్మణ్, టీపీసీసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బండ శంకర్, మండల బ్లాక్ ప్రెసిడెంట్ నందయ్య, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దుర్గయ్య, మాజీ ఎంపీపీ రమేష్, మాజీ కౌన్సిలర్లు గాజుల రాజేందర్, పుప్పాల అశోక్, నాయకులు నెహాల్, చాంద్‌పాషా, గుండా మధు, విజయ్, మహేష్ తదితరులు ఉన్నారు.





శ్రీనివాస్ వేసిన చిత్రాలు

ఊహో చిత్రం.. కళాత్మకం

చిన్నప్పటి నుంచి ఆ యువకుడికి చిత్రకళ అంటే ఆసక్తి. గీసిన ప్రతీ చిత్రంలో జీవం ఉట్టిపడుతుంది. ప్రకృతి రమణీయతతోపాటు ఊహల్లోని చిత్రాలకు ప్రాణం పోస్తాడు. తనలోని ప్రతిభనను సానపట్టాలనుకొని ఫైన్ ఆర్ట్స్‌లో చేరాడు. పలు ప్రాంతాల్లో ఆర్ట్స్ గ్యాలరీలు ఏర్పాటు చేస్తూ ఉపాధి పొందుతున్నాడు.

- చిత్రకళలో రాణిస్తున్న రుద్రంగి యువకుడు
- స్టేట్ ఆర్ట్స్ గ్యాలరీల్లో ప్రదర్శనలు

రుద్రంగి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మనసులో మెదిలే భావాలకు తన కుంచెతో ప్రాణం పోస్తున్నాడు రుద్రంగి మండల కేంద్రానికి చెందిన మంచె శ్రీనివాస్. చిన్నతనం నుంచి శ్రీనివాస్‌కు చిత్రకళ అంటే ఇష్టం. దానినే ఉపాధిగా మల్చుకోవాలనుకున్నాడు. గురువు ఎలిగేటి నరేష్ వద్ద మెళకువలు నేర్చుకున్నాడు. హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయంలో మాస్టర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ పూర్తి చేశాడు. లైవ్ ల్యాండ్ స్కేప్స్ పెయింటింగ్స్‌లో ప్రతిభ చాటుతున్నాడు. ముఖ్యంగా, పాత కాలపు కట్టడాలు, గ్రామీణ జీవితాన్ని ప్రత్యక్షంగా చిత్రించడం ద్వారా ప్రజల దృష్టిని ఆకర్షిస్తున్నాడు. పల్లెలోని జీవన శైలి, గ్రామీణుల సంప్రదాయాలు శ్రీనివాస్ చిత్రాల్లో ప్రతిబింబిస్తాయి. పల్లె జీవన సౌందర్యాన్ని సమకాలీన ప్రపంచానికి పరిచయం చేస్తున్నాడు. ప్రస్తుతం అబ్‌స్ట్రక్ట్ పెయింటింగ్‌లో శ్రీనివాస్ రాణిస్తున్నాడు. శ్రీనివాస్ వేసిన చిత్రాలను ఆర్ట్స్‌గాలరీలో ప్రదర్శిస్తున్నాడు. సొంత ఖర్చులతో 2017లో హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో స్టేట్ ఆర్ట్స్ గ్యాలరీలో సూమారు 85 చిత్రాలను ప్రదర్శించాడు. 2019లో అవిఘ్న పేరిట హైదరాబాద్‌లోని కళాకృతి ఆర్ట్స్ గ్యాలరీలో మరోసారి ప్రదర్శించాడు. 2023లో పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం ఆర్ట్స్ గ్యాలరీలో క్యాంపస్ డైరీస్ పేరిట 30 చిత్రాలను ప్రదర్శించాడు. రాష్ట్ర, జాతీయస్థాయి ఆర్ట్స్‌గాలరీల్లోనూ శ్రీనివాస్ చిత్రలాను ప్రదర్శించాడు. ఆర్ట్స్‌గాలరీల్లో శ్రీనివాస్ వేసిన చిత్రాలు నచ్చినవారు వాటిని కొనుగోలు చేయడంతో ఆదాయం పొందుతన్నాడు. వీటితోపాటు హోటళ్లు, ఆస్పత్రుల నుంచి ఆర్డర్లు పొందుతున్నాడు.



హైదరాబాద్‌లో జరిగిన ఓ ప్రదర్శనలో తన పెయింటింగ్‌లను చూపుతున్న శ్రీనివాస్

అంతర్జాతీయస్థాయిలో చిత్రాలను ప్రదర్శించాలి

- మంచె శ్రీనివాస్, చిత్రకారుడు, రుద్రంగి.



ప్రస్తుతం రాష్ట్ర, జాతీయ స్థాయి ఆర్ట్స్‌గాలరీల్లో చిత్రాలను ప్రదర్శించాను. అక్కడ మంచి గుర్తింపు వచ్చింది. అంతర్జాతీయస్థాయిలో ఆర్ట్స్‌గాలరీల్లోనూ చిత్రలాను ప్రదర్శించాలి. నా చిత్రాల్లో సామాజిక సమస్యలు, వ్యక్తిగత భావాలను చేరుస్తున్నాను. ప్రతీ కళ సమాజాన్ని ప్రభావితం చేస్తుంది. వ్యక్తిగత మానసికతను మారుస్తుంది.

నీటి కోసం ఖాళీ బిందెలతో మహిళల నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలియజేస్తున్న మహిళలు

య్రైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 7: నీటి కోసం ఖాళీ బిందెలతో కాలనీ హనుమాన్‌నగర్ మహిళలు గురువారం రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. తమ ప్రాంతానికి కార్పొరేషన్, సింగరేణి నీళ్లు వచ్చేవని, వారం రోజులుగా సింగ రేణి పూర్తిగా నీటి సరఫరాను నిలిపివేసినట్టు మహిళలు తెలిపారు. రోజు విడిచి రోజు వచ్చే మిషన్ భగీరథ నీళ్ళు సైతం మూడు రోజులుగా రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికేతర వాడలకు సింగరేణి నీటి సరఫరా నిలిపివేయడం సరికాదని, యథావిధిగా నీటి సరఫరా చేయాలని మహిళలు డిమాండ్ చేశారు.

రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ పోటీల పరిశీలకుడిగా శ్రీను

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు (ఆంధ్రజ్యోతి) 7: రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14 బాలబాలికల హ్యాండ్‌బాల్ పోటీలకు పరిశీలకుడిగా జిల్లాకు చెందిన ఫిజికల్ డైరెక్టర్ జి.శ్రీను నియమితులయ్యారు. సిద్దిపేట జిల్లాలో ఈ నెల 8, 9, 10 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం కోరపల్లి జడ్పీహెచ్‌ఎస్ పీడీ శ్రీనును అబ్జర్వర్‌గా నియమిస్తూ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి రామ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీను రాష్ట్ర స్థాయి పోటీల నిర్వహణ, మైదానాలు, సదుపాయాలు తదితర విషయాలను పరిశీలించి నివేదికను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నివేదించాల్సి ఉంటుంది. రాష్ట్ర పరిశీలకుడిగా శ్రీను ఎంపిక పట్ల జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వేణుగోపాల్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం టీఎస్ అధ్యక్ష, కార్యదర్శులు అంతడ్పుల శ్రీనివాస్, మహమ్మద్ యూనిస్‌పాషా, సీనియర్ పీడీలు సంపత్‌రావు, కే కృష్ణ, బాబు శ్రీనివాస్, గిన్నె లక్ష్మణ్ తదితరులు అభినందించారు.

వాలీబాల్ పోటీలకు ఆసిఫ్‌నగర్ విద్యార్థి ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు

భగత్‌నగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు కొత్తపల్లి మండలం లోని ఆసిఫ్‌నగర్ విద్యార్థి గుగులోతు అనిత ఎంపికయ్యారు. గురువారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థిని ప్రధా నోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు అభినందించారు. కార్యక్రమంలో వ్యా యామ ఉపాధ్యాయుడు శ్రీనివాస్, వాసంతి, శివకుమార్, రాజేంద్రప్రసాద్, ఏంజెలీన్, గంగాచారి, నాగవేణి, హరికృష్ణశర్మ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ధర్మపురి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో కాంగ్రెస్ నాయకులు రూ 2,79,000 విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎంపీటీసీ తోడేటి గంగాధర్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ ముత్యాల శ్రీనివాస్, అరికిల్ల సతీష్, జక్కుల తిరుపతి, పురంశెట్టి గంగాధర్, ముత్యాల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం


టీకాలు వేస్తున్న వైద్యాధికారి హేమలత

పెగడపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగాపూర్‌లో గురువారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయడంతో పాటు సాధారణ జబ్బులకు పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ హేమలత, సిబ్బంది మతిన్, వినీత్, నర్సయ్య, పంచాయతీ కార్యదర్శి లావణ్య, నాయకులు తిరుపతి, శేఖర్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

మల్యాల(ఆంధ్రజ్యోతి): మండలంలోని లంబాడిపల్లిలో గోపాల పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం పశు ఫెర్టిలిటీ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భకోశ సంబంధిత వ్యాధులకు సంబంధించి 135 పశువులకు చికిత్స అందించారు. ఈ శిబిరంలో పశువైద్యాధికారి రాజ్‌కుమార్, సూపర్‌వైజర్ షాదుల్లా, శ్రీనివాస్, బాబు, ఆంజనేయులు, రాజశ్రీ, మల్లేశం పాల్గొన్నారు.

పరామర్శ

రాయికల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒడ్డెలింగాపూర్ గ్రామానికి చెందిన అశోక్ విదేశంలో మరణించగా ఎమ్మెల్సీ టి జీవన్ రెడ్డి వారి కుటుంబాన్ని గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

ఉదయం బడి.. మధ్యాహ్నం సర్వే

(5వ పేజీ తరువాయి)

దివ్యాంగులు, గర్భిణులు, ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి మినహాయింపు ఇచ్చినట్లు తెలుస్తోంది. కాగా చాలా చోట్ల సర్వే విధులు కేటాయించని వారు కూడా పాఠశాలను మూసివేసి వెళ్తున్నట్లు తెలుస్తోంది. సర్వే విధులు లేనివారు పాఠశాల నిర్వహించాల్సి ఉండగా.. మధ్యాహ్నమే పాఠశాలలను మూసివేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

● **విద్యార్థులకు ఇబ్బందులు...**

ఎంపిక చేసిన పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సమార్థ్యాన్ని పరీక్షించేందుకు న్యాస్ (నేషనల్ అసిస్‌మెంట్ సర్వే)ను ప్రభుత్వం ఈ నెల 8న నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. చదువులో వెనుకబడిన వారి అభ్యసన సామర్థ్యాలను పెంచేందుకు త్రీఆర్స్ కార్యక్రమం ప్రస్తుతం కొనసాగుతోంది. అందుకు సైతం ఆటంకం ఏర్పడే అవకాశం ఉందని ఉపాధ్యాయ వర్గాలు అంటున్నాయి. గ్రామీణస్థాయిలో చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు వ్యవసాయంతో పాటు వివిధ కూలీ పనులకు వెళ్తుంటారు. వారు ఉదయం వెళ్లి, సాయంత్రం ఇంటికి వస్తా రు. ఆ సమయంలో విద్యార్థులు పాఠశాలలో ఉండే వారు. ప్రస్తుతం మధ్యాహ్నమే విద్యార్థులు ఇళ్లకు వెళ్త న్నారు. ఈక్రమంలో ఇళ్ల వద్ద పిల్లల బాగోగులు చూసే వారు లేకుండా పోతున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒంటిపూట బడి ఉంటే విద్యార్థులు పాఠశాలకు రెగ్యులర్‌గా వచ్చే అవకాశాలు తగ్గుతాయన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

సర్వే జరిగినన్ని రోజులు ఉపాధ్యాయులు ఉదయం 9.05 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం భోజనం అనంతరం 2 గంటల నుంచి సాయంత్రం వరకు ఇంటింటి సర్వే చేపడుతున్నారు. మధ్యాహ్నం 12.15 గంటలకు పలు ప్రాథమిక పాఠశాలలు మూతపడటంతో విద్యార్థులు ఇంటి ముఖం పడుతున్నారు. ఒంటిపూట బడులను ఇటు విద్యార్థి సంఘాలు, అటు ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. విద్యార్థుల చదువుపై ప్రభావం చూపకుండా యథావిధిగా బడులను నిర్వహించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

యథావిధిగా బడులను నిర్వహించాలి

నీలం సంపత్, డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు



మధ్యాహ్నం వేళలో తల్లిదండ్రులు పనులకు వెళ్తుంటారు. విద్యార్థుల భద్రత ప్రశ్నార్థకంగా మారు తుంది. ప్రతి పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి. ఒంటిపూట బడి వల్ల విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గు చూపుతారు. నవంబరు మాసంలో జాతీయ స్థాయిలో నిర్వహించే ఎన్ఏఎస్ సర్వే ఉన్నందున పాఠశాల నిర్వహణకు ఆటంకం కలగకుండా జాగ్రత్తలు వహించాలి.

సర్వే వల్ల సర్వం ఇబ్బందులే

తులసి ఆగమయ్య, యూటీఎఫ్ నాయకులు



ప్రభుత్వం సర్వే పేరుతో పాఠశాలలను ఒంటిపూట నిర్వహిస్తే, ప్రభుత్వ విద్యాసంస్థలు దెబ్బ తింటాయి. ఉదయం పూట పాఠశాల నిర్వహణ, మధ్యాహ్నం పూట కులగణన సర్వే ఉండటం వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయి. తల్లిదండ్రులు మధ్యాహ్న సమయంలో ఇంటి వద్ద ఉండక పోవడంతో అటు పిల్లకు రక్షణ కరువు అవుతోంది. మధ్యాహ్నం వ్యవసాయ పనులకు వెళుతుండడం వల్ల ఇళ్ల వద్ద సర్వే ఎన్యూమరేటర్లకు సమాచారం ఇచ్చే వారు సైతం అందుబాటులో ఉండడం లేదు. దీంతో ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొవలసి వస్తోంది.

గ్రామపంచాయతీ ట్రాక్టర్లకు జియో ట్యాగింగ్

పెగడపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 23 గ్రామాలకు చెందిన గ్రామపంచాయతీ ట్రాక్టర్లకు గురువారం అధికారులు జియో ట్యాగింగ్ చేయించారు. గ్రామపంచాయతీ ట్రాక్టర్లు నిత్యం ఎక్కడ సంచరిస్తుంది, ఏ అవసరాలకు వినియోగిస్తున్నారనే విషయాలు సులభంగా తెలుసుకోవడానికే జియో ట్యాగింగ్ చేస్తున్నామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చెరువులు, కుంటలకు శిస్తును మాఫీ చేయాలి

- మత్స్య సహకార సంఘం జిల్లా డైరెక్టర్ తోకల రాజు

మల్లాపూర్, నవంబరు, 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని చెరువులు, కుంటలకు ప్రతీ సంవత్సరం మత్స్య సహకార సంఘాలు కడుతున్న తహసీల్‌ను మాఫీ చేయాలని మత్స్య సహకార సంఘం జిల్లా డైరెక్టర్ తోకల రాజు ప్రభుత్వాని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని మొగిలిపేట గ్రామంలో గంగపుత్రులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ప్రతి సంవత్సరం వంద శాతం చేప పిల్లలను జూన్, జూలై నెలలో చెరువులలో వదిలేవారన్నారు. దీంతో ప్రతీ సంవత్సరం మత్స్యకారులు జీవనం పొందే వారని తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం నేటికీ యాభై శాతం చేప పిల్లలను వదలలేదన్నారు. దీంతో వచ్చే వెసవి కాలం వరకు చేప పిల్లలు పెరగక మత్సకారులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి నెలకొందన్నారు. ప్రతీ సంవత్సరం తహసీల్‌ను కట్టలేని పరిస్థితి ఉన్నందున 2024-25 సంవత్సరం శిస్తును మాఫీ చేయాలని కోరారు. సమావేశంలో గంగపుత్ర సంఘం నాయకులు తోకల శివకుమార్, దుబాక రాము, బొల్లి నర్సయ్య, తోకల గణేష్, గడ్డం రమేష్, దుబాక గణేష్, బొల్లి భాస్కర్, మాణిక్యం, తోకల భూమయ్య, దుబాక అశోక్, గడ్డం శ్రీనివాస్, తోకల శ్రీధర్, శివయ్య, సభ్యులు తదితరులు ఉన్నారు.

ఘనంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

రాయికల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాజీపేట గ్రామంలో శ్రీ సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేద పండితుడు చెరుకు రాజేశ్వర శర్మ పర్యవేక్షణలో స్వామివారికి పంచామృత అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు రాంగోపాల్ ఆచార్యులు, జగన్నాథ ఆచార్యుల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చరణల మధ్య, మేళతాళాల నడుమ అంకురార్పణ, యాగశాల ప్రవేశం, నవగ్రహ స్థాపన, కలశ కుండ స్థాపన చేసి యజ్ఞ హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కోల రాజు, మాజీ సర్పంచ్ వాసరి రవి, ఉప సర్పంచ్ జకిలేటి హరీష్ రావు, మాజీ ఎంపీటీసీ మోహన్, ఆలయ కమిటీ సభ్యులు బోయిని నరేందర్, ఇద్దం గంగారెడ్డి, అంబల్ల జీవన్ రెడ్డి, అనుపురం సత్యంగౌడ్, చల్ల రాజేందర్ రెడ్డి, అయిండ్లేని గంగారెడ్డి, లింబయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

జగిత్యాల క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాల మైదానంలో ఉమ్మడి జిల్లా స్థాయి పాఠశాలల క్రికెట్ ఎంపిక పోటీలను గురువారం నిర్వహించారు. జగిత్యాల, కరీంనగర్, రాజన్న సిరిసిల్లా, పెద్దపెల్లి జిల్లాల నుంచి అండర్-17 బాలికల విభాగంలో పలువురు విద్యార్థినులు పాల్గొని తమ ప్రతిభను చాటారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో పాల్గొననున్నట్లు జిల్లా విద్యాధికారి జగన్‌మోహన్ రెడ్డి, జిల్లా క్రీడల కార్యదర్శి లక్ష్మీరామ్ నాయక్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పేటా అధ్యక్ష, కార్యదర్శులు విశ్వ ప్రసాద్, అశోక్, పీడీలు భాస్కర్, అప్సర్, కృష్ణ ప్రసాద్, అజయ్ ఉన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్


కోటిలింగాల గోదావరిలో చేపపిల్లలు వదులుతున్న విప్ అడ్లూరి

వెల్గటూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. జిల్లా మత్స్య శాఖ ఆధ్వర్యంలో మండలంలోని కోటిలింగాల గోదావరిలో మూడు లక్షల చేప పిల్లలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులు ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వం వందశాతం రాయితీపై ఉచితంగా చేపపిల్లలలు పంపిణీ చేస్తోందన్నారు. మత్స్య సహకార సంఘానికి చెందిన గంగపుత్రులు, ముదిరాజ్‌ల కోరిక మేరకు ప్రభుత్వ పెద్దలను ఒప్పించి ధర్మపురి నియోకవర్గంలో 20 ఎకరాల ప్రభుత్వ భూమిని ఇచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మత్స్యకారులు సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అభివృద్ధి అధికారి డాక్టర్ విజయభారతి, ఇరిగేషన్ డీఈఈ ధర్మకుమార్, ఏఎంసీ చైర్మన్ గోపిక జితేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, మత్స్య సహకార సంఘం మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల సతీష్, నాయకులు రాంమోహన్‌రావు, పోలోజు శ్రీనివాస్, మెరుగు మురళి, గుమ్ముల వెంకటేష్, సందీప్‌రెడ్డి, శ్రీకాంత్‌రావు, సతీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గోదావరి మాతకు అడ్లూరి పూజలు

● కార్తీక మాసం సందర్భంగా మండలంలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రం కోటిలింగాలలో గోదావరి మాతకు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి నాగరాజు శర్మ మంత్రోచ్చారణల మధ్య పూజలు నిర్వహించారు. అంతకు ముందు శ్రీపార్వతీ కోటేశ్వర ఆలయ పూజారులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గోపిక జితేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే


దాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కొడిమ్యాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు అధైర్య పడవద్దని కోరారు. మిల్లర్లతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకుంటామన్నారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందన్నారు. ఎమ్మెల్యే వెంట మండల పార్టీ అధ్యక్షుడు నారాయణగౌడ్, సింగిల్ విండో చైర్మన్ రాజనర్సింగరావు, మల్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ జీవన్‌రెడ్డి, నాయకులు నాయకులు రాజేందర్, ప్రభాకర్‌రెడ్డి, మల్లేశం, రాఘవరెడ్డి, ప్రసాద్, వినోద్‌రెడ్డి, మదు తదితరులు పాల్గొన్నారు.

మహిళల హక్కుల కోసం పోరాటం చేస్తాం

కోరుట్ల, నవంబర్ 7(ఆంధ్రజ్యోతి): మహిళల హక్కుల కోసం పోరాటలు ఉధృతం చేస్తామని భారత జాతీయ మహిళ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి అన్నారు. గురువారం పట్టణంలోని సి ప్రభాకర్ భవనంలో మహిళ సమాఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ దేశంలో అస్తిత్వ పోరాటలు ఆత్మగౌరవ పోరాటాలు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కుల శాంత, గంగామణి, సంతోష, శీరీష, లక్ష్మీ, స్వప్న పాల్గొన్నారు.

పట్టభద్రుల శ్రేయస్సుకు కృషి చేస్తా

కోరుట్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పట్టభద్రుల శ్రేయస్సు కోసం తనవంతు కృషి చేస్తానని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేయనున్నట్లు తెలిపారు. పట్టభద్రుల ఎన్నికలలో తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

నాణ్యత పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మల్లాపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వరి కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చిన రైతులను నాణ్యత పేరుతో రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయవద్దని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ నిర్వాహకులకు సూచించారు. గురువారం మండలంలోని రేగుంట గ్రామంలో ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటను కేంద్రాలకు తీసుకొచ్చిన వెంటనే తూకం వేయాలని, వెంటనే ఖాతాలోకి డబ్బులు జమచేయాలని సూచించారు. మల్లాపూర్ ప్యాక్స్ చైర్మన్ నర్సారెడ్డి, పాలకవర్గం, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులను ఆదుకుంటాం

కోరుట్ల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): విధుల్లో ఉన్న సమయంలో ప్రమాదం జరిగి గాయాల పాలైన పారిశుధ్య కార్మికులను ఆదుకుంటామని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ఒక ప్రకటనలో తెలిపారు. కోరుట్ల పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు కాగా వారి పరిస్థితిపై ఆయన అరా తీశారు. కోరుట్ల మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్, ప్రభుత్వ అసుపత్రి వైద్యులతో ఆయన మాట్లాడి గాయాలైన కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.

శాశ్వత భవనాల నిర్మాణం త్వరగా చేపట్టాలి


మాట్లడుతున్న బీజేపీ నాయకుడు మంచే రాజేష్

బుగ్గారం నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్మించే ప్రభుత్వ శాశ్వత భవనాల నిర్మాణం త్వరగా చేపట్టాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు మంచే రాజేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలో స్థానిక నాయకులతో కలిసి రాజేష్ ప్రభుత్వ భవనాలు నిర్మించబోయే స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం తొమ్మిది సంవత్సరాలుగా శాశ్వత భవనాలు నిర్మాణం చేపట్టడంలో విఫలమైందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం లాగే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రజలను మోసం చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం త్వరగా ప్రభుత్వ భవనాల నిర్మాణం చేపట్టకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మేడవెని శ్రీధర్, ఉపాధ్యక్షుడు మందపల్లి శ్రీనివాస్, నాయకులు భారతపు గంగాధర్, జంగ రమేష్, తిరుపతి, కప్పల నరేష్ ,బొడ్డు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

ఎండపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని, ఏ ఆపద వచ్చినా అండగా నిలుస్తామని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మండలంలోని అంబారిపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త అల్లంల పద్మ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి గురువారం ఆమె ఇంటికి పరామరిశంచి ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సింహాచలం జగన్, నాయకులు ఏలేటి కృష్ణారెడ్డి, చెంద్రారెడ్డి, గాజుల మల్లేశం, మేరుగు జానీ తదితరులు పాల్గొన్నారు.

రక్షణ కల్పించాలని ఫిర్యాదు

మల్లాపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రేమించి పెళ్లి చేసుకున్న తమకు కుటుంబసభ్యులతో ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని మల్లాపూర్ పోలీసు స్టేషన్‌లో దంపతులు గురువారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాతారాం గ్రామానికి చెందిన అబ్బాయి, అమ్మాయిలు ఇద్దరు పది సంవత్సరాల నుంచి ప్రేమించుకున్నారు. ఇద్దరి కులాలు వేరు కావడంతో ఇరు కుటుంబ సభ్యులు ఒప్పుకోలేదు. దీంతో దంపతులు గురువారం ఆలయంలో పెళ్లి చేసుకున్నారు. పెళ్లి చేసుకున్న తమకు కుటుంబసభ్యుల నుంచి రక్షణ కల్పించాలని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసికున్నట్లు ఎస్సై తెలిపారు.

రైతులను ఇబ్బంది పెట్టకుండా కొనుగోళ్లు చేపట్టాలి

- కలెక్టర్ సత్యప్రసాద్


ఆత్మనగర్‌లోని కొనుగోలు కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

మెట్‌పల్లి రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతులను ఇబ్బంది పెట్టకుండా ధాన్యం కొనుగోళ్లను సహజావుగా చేపట్టాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులకు సూచించారు. గురువారం మండలంలోని ఆత్మనగర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రానికి ఎంత మంది రైతులు తీసుకొచ్చారని, గన్ని సంచులు వివరాలు తెలుసుకున్నారు. ధాన్యం కుప్పలను పరిశీలించి మ్యాచర్ పరిశీలించారు. కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యం మ్యాచర్ వచ్చిన వెంటనే తూకం వేసి రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. కేంద్రాల పరిస్థితిని ఏ విధంగా ఉందని మండల వ్యవసాయాధికారి దీపికను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మ్యాచర్ వచ్చిన వాటిని వెంటనే తూకం వేయాలని నిర్వాహకులకు సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యం వెంటనే మిల్లుకు ఎగుమతి చేయాలని, లారీల సమస్య రాకుండా సంబంధిత కాంట్రాక్టర్ తగు సూచనలు చేయాలని అధికారులను ఆదేశించారు.

గ్రామంలోని రైతులు ధాన్యం విక్రయించడానికి కేంద్రం స్థలం సరిపోవడంలేదని, అటవీ భూమిని అక్రమంగా కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని మాజీ ఎంపీపీ నీలమ్మ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ వెంట డీఆర్డీవో రఘువరణ్, జిల్లా పౌర సరఫరాల అధికారి జితేందర్, మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది, నిర్వహకులు, రైతులు, తదితరులు ఉన్నారు.

ఇబ్రహీంపట్నం (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోధూర్, ఇబ్రహీంపట్నంలో దాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ బి సత్యప్రసాద్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం ఎంత మొత్తంలో వస్తుంది, ధాన్యానికి సంబంధించిన తేమ ఏ విధంగా ఉందని కలెక్టర్ పరిశీలించారు. అలాగే ధాన్యాన్ని తీసుకొని మ్యాచర్ ఏ విధంగా ఉందని తనిఖీ చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ ప్రసాద్, జిల్లా పౌర సరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి, డీఆర్డీవో రఘువరన్, సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి



చౌలమద్దిలో ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణ

జగిత్యాలరూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను అడిషనల్ కలెక్టర్ గౌత్‌మ్‌రెడ్డి ఆదేశించారు. జగిత్యాల మండలం తిప్పన్నపేటలో నిర్వహిస్తున్న సమగ్రకుటుంబసర్వేను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ కుటుంబ నిర్ధారణ వివరాలు తప్పులు లేకుండా సేకరించి నమోదు ప్రక్రియను పూర్తిచేయాలని సూచించారు. సర్వేపూర్తిఅయిన తర్వాత ఇంటిగోడకు స్టిక్కర్ తప్పనిసరిగా అంటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల అర్బన్ ఇన్‌చార్జి ఎంపీడీవో రమాదేవి, తిప్పన్నపేట స్పెషల్ ఆఫీసర్ రాజేందర్‌రావు, పంచాయతీకార్యదర్శి కొమురయ్య, కారోబార్ శేర్ల రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

● జగిత్యాల రూరల్ మండలంలోని అంతర్గాం గ్రామంలో సమగ్రకుటుంబ ఇంటింటి సర్వే రెండోరోజు కొనసాగుతుంది. ఈ సందర్భంగా గురువారం రూరల్ మండల ప్రత్యేకాధికారి నరేష్, ఎంపీడీవో రమాదేవి సర్వే నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని 29 గ్రామాల్లో సర్వే కొనసాగుతుందని, ఈ సర్వే కోసం 243 మంది ఎన్యూమరేటర్లు, 20 మంది సూపర్‌వైజర్లను నియమించినట్లు తెలిపారు.

మెట్‌పల్లి రూరల్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో చేపట్టిన ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా పారదర్శకంగా చేపట్టాలని ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణ సూచించారు. గురువారం మండలంలోని చౌలమద్ది గ్రామంలో ఎన్యుమరేటర్లు చేస్తున్న సర్వేను పరిశీలించారు. వారు ఇంటింటికి వెళ్లి సేకరిస్తున్న కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎలాంటి తప్పులకు తావివ్వకుండా పకడ్బందీగా చేయాలని, సర్వేలో ఏవైనా సందేహాలు తలెత్తినట్లయితే వెంటనే నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవి, ఎన్యూమరేటర్లు వాసాల రాములు, కవిత, దీప, లక్ష్మి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్ (ఆంధ్రజ్యోతి): సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల గణనను గురువారం మండల ప్రత్యేకాధికారి నాగమణి మండలంలోని జోగిన్‌పల్లిలో పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అదేవిధంగా ధర్మారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రానికి తీసుకురావాలని కోరారు. తేమ శాతం 17కు తక్కువ ఉంటేనే తూకం వేయాలని సిబ్బందికి సూచించారు.

ఎండపల్లి (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి గురువారం రోజున మండలంలోని కొత్తపేట గ్రామంలో అధికారులు ఇంటింటికి తిరిగి సామాజిక ఆర్థిక, విద్య, ఉపాధి వివరాలను సేకరించి నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడివో, ఎంపీవో పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మృతుడి కుటుంబానికి పరామర్శ

కథలాపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుంపెటకు చెందిన తోట లింగం అనే వ్యక్తి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా గురువారం వేములవాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి మృతుడి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ జెల్ల వేణుగోపాల్, మాజీ కోఆప్షన్ సభ్యుడు రఫీ, మాజీ ఎంపీటీసీ రమేశ్, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మెట్‌పల్లి టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అందరికి అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారనికి కృషి చేస్తానని ట్రస్మా తెలంగాణ చీఫ్ అడ్వైజర్ యాదగిరి శేఖర్‌రావు అన్నారు. గురువారం పట్టణంలోని మహాజన్ గార్డెన్‌లో ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తానని తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

కరాటేలో ప్రతిభ కనబర్చిన 'శ్రీచైతన్య' విద్యార్థి

కోరుట్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇటీవల సంగారెడ్డిలో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ కరాటే పోటీల్లో పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థి ప్రతిభ కనబర్చి కాంస్య పథకం సాధించాడు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో విద్యార్థి శంకు రిషికేశ్‌ను అభినందించి, ప్రశంస పత్రం అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ రేణుక, పీఈటీ ప్రవీణ్, ఒకినావా స్కూల్ ఆఫ్ కరాటే స్పోర్ట్స్ అసోసియేషన్ ఫౌండర్, కోచ్ అల్లె రమేష్ పాల్గొన్నారు.

వైద్యాధికారులకు శిక్షణ

సిరిసిల్ల టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పల్లె దవాఖానాల్లో నాణ్యమైన వైద్య సేవల కోసం వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం నేషనల్ క్వాలిటీ స్టాండర్డ్ అస్సురెన్స్ స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్ రాధిక మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్‌కు శిక్షణ తరగతుల నిర్వహించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వసంతరావు సమావేశం నిర్వహించారు.